# అపరాజిత!

"రంగారావ్"

'కోట్లు'—కోటానుకోట్లు కాకపోయినా బట్టను బట్టీ కత్తెరనుబట్టీ అనేకరకాలుంటాయి.

కేవలం జేబులసంఖ్యలోని తేడాతో 'కోట్లలో' కొన్ని విభాగాలున్నాయి. ఆ మహాసందోహంలో బయట మూడూ లోపల ఒక్కటీ—జేబులు గల కోటు ఒకరకం.

అనగనగా అలాంటి కోటొక్కటి.

ఆ కోటుకు నాలుగు జేబులు.

'లీకు'తున్న కలంతో సహా జీవిస్తున్న భగవద్గీత 'పాకెట్ ఎడిషనూ' ఆ ఎడిషనుమున్య కర్నూలూ కంచీ కాకినాడా ఖరగ్‌పూరులలో తమ మార్కెట్ ధరలు తేల్చుకోలేక తికమకపడుతున్న భవిష్యజ్ఞామాతిల లిస్టూ—

విభవనామ సంవత్సర జ్యేష్ఠశుద్ధ నవమీ గురువార దివసాన ఉదయాత్పూర్వ వేళయందు రామనాథం - కమలమ్మల వంశాంభోనిధి పాలిట చంద్రరేఖగా వెలిసిన చి॥ సౌ॥ లక్ష్మీకుమారి జాతకమూ, ఏతద్ జాతకమిమ్మద వశిష్ఠుడూ, కామతనాడయుడూ, ప్రొఫెసగుడూ ప్రసరించిన వేర్వేరు ఆశాకిరణాల సంపుటాలూ—

'మానికే వరుల' వారి మూడో అబ్బాయి తాలూకు 'పాస్‌పోర్టు' సైజు ఛాయాచిత్రమూ, దానితో బాటు వారడిగిన లాంఛనాలు నిండిన పావుతావుల సంపుటి—

అవుతున్న ఖర్చులకోసం వదిలిపెడుతున్న డబ్బలకు మాజీ పుట్టినిల్లయిన మనీపర్సూ, కాబోయే వియ్యంకుళ్ళకు రాయబోయే కార్డులూ—

ఇవి నాలుగు జేబులనూ వరుసక్రమంగా అలంకరించాయి.

—రామనాథం ఒక్కసారి మొహాన్ని రుమాలుతో తుడుచుకుని జేబుల బరువు ఫలితంగా ఊడిపోతున్న కోటు బత్తాలను సరిచేసుకుని, తలెత్తి పేరిశాస్త్రిల వంక చూశాడు.

ఫాలభాగంమీది గంధం రేఖమీదుగా తన కుడి చేతి చిటికెన వేలును రాస్తూ పలికారు పేరిశాస్త్రిల్లు— "అంతేనండి, రామనాథంగారూ! కాస్తా ఈ కుజుడుగనుక ఆ ఇంట్లో వుండివుంటే— ఈ నెల్లూరబ్బాయికన్న మించిన సంబంధం లేదనుకోండి!"

"హుఁ" అనుకుని నెల్లూరి వరరత్నం జాతకాన్ని మడిచి భగవద్గీతలో పెట్టుకుని, లేచాడు రామనాథం.

* * *

'మలయమారుతాల మధురరాగాలకు తీవెలకొసని పూలబాలలు ఎదలుమరచి పదాలు వేస్తుంటే, కోయిలలూ, క్రౌంజిపుల్లా తలలూపుతున్నాయి. తళుకు బెళుకుల తారకలు గజ్జెలై ఘల్లుమంటుంటే, పాల వలువలు మేనబూనిన పసిడివెన్నెల వింత విన్యాసాలను విసరుతూంది. సంగీతం సౌరభాన్ని పంచుతూంది. సౌందర్యం పంతోషాన్ని చల్లుతూంది. అదంతా ఏవిటో! అదంతా ఎక్కడో!!

'ఈ సౌందర్యానందాల మధ్య ఉన్నట్లుండి ఒక మూర్తి అవతరించాడు. ఇంత అందమూ అతనికి అంజలి ఘటించింది. ఆ మూర్తి రాజఠీవితో ముందుకు సాగి వస్తున్నాడు. అతడి నొసటిమీది తిలకం దర్పంతో చూస్తూంది. శంఖంలాంటి గళసీమను విరహోత్కంఠిత బాహు యుగళిలా పెనవేసుకున్న హారం దివ్యతేజంతో మెరుస్తూంది. నవరత్న ఖచితమయిన నవ్వు అతడి అధరాలమీద ఆనందనృత్యం చేస్తూంది. అతడి కళ్ళు ఒళ్ళుకి గిలిగింతలు పెడుతున్నాయి.'—

—'కుమారి ఎం. లక్ష్మి' అని రాసివున్న పుస్తకం క్రిందపడింది.

రాకెట్‌ను పరిహసించే వేగంతో మనస్సు క్రిందకు దిగింది.

అట్టే జనంలేని రోడ్డుమీద ఒకానొక బస్సుకని నిల్చున్న లక్ష్మికళ్ళు, ఎదుటి బస్ స్టాప్ మీదకు వెళ్ళాయి.

తెల్లటి పంట్లాం, తెల్లటి చొక్కా, నీలిరంగు టై ధరించిన 'అతడు' కనిపించాడు. అతడి భుజం మీద స్టెతస్కోపు వేలాడుతూంది. కళ్ళు చేతున్నాయి. అతడు నవ్వుతున్నాడు!—తటాలున తల తిప్పుకుని, మొహం ముడుచుకుని, పమిటను బాగా లాగి కప్పుకుంది లక్ష్మి.

'ఎంత సిగ్గు ఎంత సిగ్గూ!...ఏమిటీ ఆ వెర్రి వెర్రి ఆలోచనలు...అంతసేపూ అలా...అబ్బ!...అతడి వైపు చూశానుగాబోలు!...ఏమనుకుని వుంటాడతడూ?...ఛీ!'

—ఈసారి బస్సు రణగొణ ధ్వని వాస్తవికానికి ప్రతినిధై మేలుకొలిపింది.

లక్ష్మి ఇల్లు చేరింది.

ఆరోజు రాత్రి భోజనాలదగ్గర—

"అయితే, అంతేనన్నమాట?" అంది కూర వడ్డిస్తున్న కమలమ్మ.

"ఆ...అంతే! అన్నీ బాగున్నాయి కాని కుజుడు బావులేట్ట!"

"కుజుడూ, గురుడూ అంటూ ఇలా ఎన్నాళ్ళండీ?"

"ఏంచేస్తాం కమలా! చూస్తూ చూస్తూ జాతకం కుదరనిచోట అమ్మాయి నెలా ఇవ్వడం?"

"ఆ...తిరపతి వాళ్ళేమయినా సమాధానమిచ్చారా?"

"ఆ! ఇచ్చారు! నాలుగు వేలకు తక్కువయితే వాళ్ళసలు అనుకోదలచుకో లేదట!"

"హుం...దానికి పదిహేనోఏడు కూడా నిండబోతూంది." అంది కమలమ్మ. రామనాథం రెండు నిముషాలపాటు మాట్లాడకుండా భోజనం చేశాడు. హఠాత్తుగా పలికాడు.

"కమలా! ఈ సంవత్సరంతో లక్ష్మిని చదువు మాన్పించేస్తాను!"

కమలమ్మ మొహంమీద ప్రశ్న వెలిగింది.

"ఏదో ఫోర్తుఫారందాకా చదివింది...చాలు! ఇంట్లో వుంటే నాకు చేదోడువాదోడుగా వుంటుంది. అదిగాక, సరస్వతికూడా మూడోఫారానికి రాబోతున్నది. దానితర్వాత గాయత్రీ, బాబ్జీ వున్నారు. వీళ్ళందరికీ జీతాలూ, చదువులూ, పెళ్ళిళ్ళూ—నా చేత కాదు కమలా!"

కమలమ్మ మొహంమీద ప్రశ్న పోయింది; సానుభూతి వచ్చింది.

—'మొదటి తల్లికోట యుద్ధము, ఎప్పుడు, ఎక్కడ, ఎవరెవరికి మధ్య జరిగెను?' అని పరీక్షార్థం భారతదేశ చరిత్రను అతి తీవ్రంగా పరిశోధిస్తున్న కుమారి లక్ష్మికి అప్పట్లో తాను రాయబోయే ఆఖరి పరీక్ష అదే అని తెలియదు మరి!

* * *

వాయిదాల పద్ధతిలో దాదాపు వేయి రూపాయలు రైలువాళ్ళకూ పోస్టలు వాళ్ళకూ, విరాళాలిచ్చాడు రామనాథం. ఊళ్లు తిరిగాడు; ఉత్తరాలు రాశాడు. అతడి మనస్సు పదహారు పౌండ్ల దేహాన్ని ఆరగించింది. కుమారి లక్ష్మి చదివివుంటే ఎస్. ఎస్. ఎల్. సి. అయిపోయివుండేది. సరస్వతి నాలుగో ఫారం పూర్తిచేసింది. గాయత్రి అయిదో తరగతి దాటింది. బాబ్జీకి రైల్లో అరటిక్కెట్టు కొనాల్సిన ఈడొచ్చింది.

—"అయితే ఆ అనకాపల్లి వాళ్ళకు సరస్వతి ఫోటో అదీ పంపుతారా?" అంది తమలపాకులకు సున్నం రాస్తున్న కమలమ్మ.

"ఆ..."—వెల్లకిల పడుకుని వున్నాడు రామనాథం. ఉన్నట్లుండి గుండెలో శూలం పెట్టి పొడిచినట్లయింది. పళ్ళతో క్రింది పెదవిని నొక్కిపట్టాడు అదొక మహాయుద్ధం.

చీకటి కమలమ్మ మనశ్శాంతిని కాపాడింది.

"దేవుడి దయవల్ల కుదిరితే ఈ శ్రావణంలోనైనా రెండు పెళ్ళిళ్ళు ఒక్కసారే చేసేయవచ్చు."—మనసు మేళతాళాలకూ, మంగళ సూత్రాలకు మధ్య విహరిస్తోంది.

"ఏమండోయ్! ఏమీ పలకరేం..."

"అలగే అలాగే! కనీసం లక్ష్మిదయినా కుదిరితే—"

"ఐతే సరస్వతినీ ఈసారితో బడి ఆపించేద్దాం."

"వద్దు" అన్నాడు రామనాథం కటువుగా. కమలమ్మ ఉలిక్కిపడింది. లేచి కూచున్నాడు రామనాథం. "వీల్లేదు కమలా! వీల్లేదు. సరస్వతిని చదవనివ్వాలి! అప్పుడు బుద్ధిగడ్డితిని పెద్దదాని చదువు పాడు చేశాను. కనీసం సరస్వతయినా ఆ ఎస్. ఎస్. ఎల్. సీ. పూర్తిచేస్తే మున్ముందు..." అంతటితో ఆగిపోయాడు రామనాథం. నలభైయేళ్ళ జీవితంలోనూ మొట్టమొదటి

సారిగా అతిడి ఆలోచనా యంత్రాన్ని అర్థంకాని అమావాస్య ఆవరించింది. కాలెక్కడికో జారిపోయి నట్లనిపించింది.

—కమలచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు మానవుడు - రామనాథం.

హాల్లో నిద్రపోతూన్న లక్ష్మీకుమారి నిద్రముంగు తెల్ల పంట్లామూ తెల్లచొక్కా తేలియాడుతున్నాయి.

...మహాయుద్ధంలో - చిరంజీవి మృత్యువు మరొక్కసారి మందహాసం చేసింది—

"ఇంకేముందమ్మా....గుండె ఆగి పదినిమిషాలయింది" అని లేచారు డాక్టరు మల్లికార్జునరావుగారు.

'ఆ!' అని అరిచి రామనాథం దేహంమీద పడిపోయింది కమలమ్మ. లక్ష్మి సరస్వతీ గాయత్రీ లేగదూడల్లా రోదించారు. బాబ్జి అమ్మచీరనుపట్టి లాగుతున్నాడు.

గుండె లగ్నిపర్వతాలయాయి.

రక్తం కన్నీరయింది.

ఊహించిన భవిష్యత్తు పేకముక్కలకోట అయింది......

...భూగోళం సూర్యభగవానుడిచుట్టూ రెండు రెండు ప్రదక్షిణాలు పూర్తిచేసింది.

కాలం బాధ కాఠిన్యం తగ్గించింది; కర్తవ్యం లోకి దించింది.

స్నేహాన్ని 'సృష్టిలో తీయని' దానిగా చేసిన కొద్దిమందిలో ఒకరయిన రాజారావుగారు బాల్య స్నేహితుడు రామనాథాన్ని మరణించిన తర్వాతకూడా మరవకుండా వున్నారు. ఎస్. ఎస్. ఎల్. సి. పూర్తి చేసిన సరస్వతికి డైరెక్టర్ రాజారావు తమకంపెనీలో వందా పదిరూపాయలు జీతంమీద ఉద్యోగం ఇప్పించారు.

యామిని సెలవుతీసుకుంది.

ఉషస్సు 'రానా?' అంది......

* * * *

"మాడవే, అక్కయ్య విడు—! నా పెన్సిలు తీసుకుని ఇవ్వనంటున్నాడు..."

"ఒరేయ్ బాబ్జీ! గాయత్రి పెన్సిలు దానికిచ్చెసెయ్."

"మరి నాకో?"

తానురాస్తున్న ఫైలును మూసేసి కుర్చీలోనుంచి లేచి బాబ్జీని ఎత్తుకుంది సరస్వతి.

"పెన్సిలుతో పాఠం రాసుకోకుండా వెడితే, చిన్నక్కయ్యని మేష్టారు కొడతారమ్మా..."

"మేష్టారిని నేను కొడతానే!"

"తరివేతవా! రేపు బళ్ళో చేరింతర్వాత ఆ పనే చేద్దువుగాని. ముందు చిన్నక్కయ్య పెన్సిలు ఇచ్చెయమ్మా...నీకు సాయంకాలం రంగు రంగుల బలపాలు పట్టుకొస్తానుగా—"

"అక్కయ్యా, అక్కయ్యా..... మరి సుద్ద ముక్కలు?"

"ఓ...అవికూడా! ఓ పెట్టెనిండా తెచ్చిస్తాను. ఏం?"

"అయితే సరే!" గాయత్రి తన పెన్సిలు పుచ్చుకుని వెళ్ళిపోయింది.

సరస్వతి బాబ్జీ నెత్తుకుని స్నానాలగదిలోకి వెళ్ళింది. స్నానం అయింతర్వాత వాడిని తుడవడానికని పడకగదిలోకి వచ్చింది. మంచంమీద పడుకుని ఏదో పాతపత్రిక తిరగవేస్తూంది కమలమ్మ. సరస్వతి బాబ్జీని తుడుస్తుండగా కమలమ్మ ఒక్కనిముషం సేపు 'ఖళ్ళు'న దగ్గింది.

"అమ్మా!" అని పిలిచింది సరస్వతి.

"ఏంతల్లీ!"—కమలమ్మ ఎగశ్వాస పీలుస్తూంది— "ఈ దరిద్రుడేమయినా అల్లరిపెట్టాడా? వీళ్ళందరూ కలిసి నీ ప్రాణాలు తినేస్తున్నారే!"

"అబ్బబ్బ! అదేమీ లేదమ్మా...నీ ఆ దగ్గు వింటుంటే భయంగావుంది. డాక్టర్ మల్లికార్జునరావ్ దగ్గరికి వెళ్ళి కూడదూ...?"

"ఎందుకులే సరస్వతీ?"

"ఎందుకులే, ఎందుకులే అని కాస్త పెద్దగా ఏదయినా తెచ్చుకుంటే పిల్లలం మేము ఏడవ్వాలి కదమ్మా!"

"నాకేమీ రాదుతల్లీ! అంత అదృష్టమే వుంటే నేనే ముందు పోయేదాన్ని."

"ఆ మాటొకటి నేర్చుకున్నావ్ అన్నిటికి ముందు!...నీవువెళ్ళకపోతే సాయంకాలం ఆఫీసునుండి వస్తున్నపుడు నేనే వెళ్ళివస్తా..."

* * * *

"సరస్వతీ! వడ్డించాను రావే! తొమ్మిదయిందీ—" అంటూ సగం తడిసిన చీరకొంగును నడుములో చెక్కుకుని ప్రవేశించింది లక్ష్మి.

లక్ష్మిని చూడగానే కమలమ్మ మొహం అటు తిప్పుకుంది. లక్ష్మికి, కమలమ్మకూ మధ్య సరస్వతివుంది. కమలమ్మ కళ్ళు నీళ్ళూరుతున్నాయి.

'ఈ అమ్మకెపుడు తెలివొస్తుందో'—అనుకున్న సరస్వతి—"ఇదుగో, నిముషంలో స్నానంచేసి వస్తానక్కయ్యా! ముందు గాయత్రికి పెట్టి, దాన్ని పంపించేసెయ్" అని ఉతికిన చీరా, సబ్బూ, పట్టుకుని అక్కయ్య వెనకాల నడిచింది—

"అక్కయ్యా! నేను బడికివెళ్తున్నా!" అని గుమ్మంలోంచి కేక పెట్టింది గాయత్రి.

"అలాగే!" అంటూ లక్ష్మి సరస్వతికి నెయ్యి వడ్డించింది.

"ఏమే అక్కయ్యా! ఆ సైన్సు బొమ్మ మళ్లీ గీచావు టే?"

"అబ్బ, లేదే!...నీకింకొంచెం కూరగావాలేమో, చూడు!"

"నీకు చదువంటే బొత్తిగా శ్రద్ధే వుంటం లేదు."

"అదికాదే—తీరిక దొరక్కుండా వుంది"

"ఎలాగో తీరిక చేసుకోవాలి మరి! మొత్తంమీద నీవీసారి ఆ ఎస్. ఎస్. ఎల్. సీ. అయిందనిపించాలి."

"అలాగేలేవే...అయినా లెక్కలంటే కొంచెం ఇదిగా వుంది." అంటూ లక్ష్మి మజ్జిగ గిన్నెను చెల్లిలి పక్క పెట్టింది.

"లెక్కలేగా - నేను చెబుతానులే! రోజూ రాత్రిపూట ఓ గంట చదివావంటే తప్పకుండా పాసవుతావక్కయ్యా"

"ఊ"—అన్న లక్ష్మి మనసులో—ఎక్కడో ఒక మూలలో—రోజూ రాత్రి కళ్ళుమూసుకునేసరికి ప్రత్యక్షమయే ఆతెల్ల చొక్కా మీద నీలిరంగుటై, స్టెతస్కోపూ ధరించిన మూర్తి—మెదిలింది.

'అక్కయ్యా! నీమొహం అలా ఎర్రగా వుందేమిటే?"

"అబ్బెబ్బె ఏమీ లేదే..."

"జ్వరంగాని వచ్చిందేమిటి?

"జ్వరమూ లేదు, జలుబూ లేదు—నీవు ముందు లేచి ఆఫీసుకు వెళ్ళవే—టయిమయింది..."

"ఏమో నమ్మా! జ్వరం అదీ వస్తే కాస్త ముందే జాగ్రత్త పడండి! అంతే కాని తర్వాత..."

"అబ్బబ్బ! నీలెక్చరిహ చాల్లేవే...!మరీ ఇటీవల అందరికీ మొగుడి కింద తయారవుతున్నావ్..." అని లేచి వెళ్ళింది లక్ష్మి.

ఆమెను చూస్తూ నిట్టూర్చిన సరస్వతిలో వాళ్ళ నాన్న అంశం విశ్వరూపం ధరించింది.

*     *     *     *

'విరజాజులూ
హరివిల్లులూ
విరిశాయి-నీ
చిరునవ్వులో
మురిసింది-నా
ఎదకోర్కతో'

—అని డైరీలో రాసుకున్నాడు శ్రీనివాసరావు. మూడుసార్లు చదువుకున్నాడు. డైరీ మూసేసి సిగరెట్టు వెలిగించాడు. లైటార్పి కిటికీదగ్గర కొచ్చి నిల్చున్నాడు. బయటికి చూశాడు.

విభావరి వేయి హస్తాల క్రింద విశ్వం విశ్రాంతి తీసుకుంటూంది. నక్షత్రాల రత్నాలు నీలికంబళిమీద నిశ్శబ్దంగా నవ్వుతున్నాయి. మేఘ బాలల పవిట చాటున దాగుడు మూతలాడుతున్నాడు దశమినాటి శశిరాజు. తల్లిజోలపాటలా, ప్రియసతి ప్రేమ కలలా మెల్లగా కదులుతున్నాడు వాయుకుమారుడు.

అంత ఆనందాన్ని భరించలేనన్నది శ్రీనివాసరావు హృదయం. అతడి కళ్లు మూసుకున్నాయి—పొద్దున...

"డాక్టరుగారు లేరా?" గాజు గ్లాసుకు స్పూన్ తగిలినట్లుండింది ఆ స్వరం.

"లేరండీ! ఇపుడే ఒక కేసుకని వెళ్ళారు."

"సరే...అయితే."

"మీకేమి కావాలో చెబితే...?" అని అతడంటుండగానే వెళ్ళిపోతున్న ఆ అమ్మాయి వెనక్కి తిరిగిచూచింది.

ఆదినుండీ అసంఖ్యాకులనుభవించిన అనుభూతి ఆ క్షణం అనంతమై, నవనవోన్మేషణమై పునరుక్తమయింది.

"మీ పేరు?"— యౌవనంలోని కుతూహలం అడిగించింది పాతికేళ్ల అబ్బాయిని.

"మా అమ్మపేరు కమలమ్మ"—ప్రపంచాన్ని తెలుసుకున్న జ్ఞానం పలికించింది పద్దెనిమిదేళ్ల అమ్మాయిని.

"నేనడిగింది మీ పేరు..."

"అది మీ కెందుకూ?"

"ఊరికే తెలుసుకుందామని..."

'అబ్బబ్బ! అతడి కళ్ళలా వెతుకుతాయేం...'

"పేరు చెప్పడానికిష్టం లేకపోతే పోనివ్వండి కాని ఆ సీసా ఇలా తెండి."

"ఏం మందివ్వాలో మీకు తెలుసా?"

"ఆ..." అంటూ ఆమె చేతిలోని సీసాను తీసుకున్నాడు. అతడి చేయి తన చేతికి తగలనందుకు ఆమె 'అమ్మయ్య' అనుకుంది. అమ్మ దగ్గును వివరించింది.

అతను మందు కలిపి సీసాలో పోస్తున్నాడు.

"మీరు కంపౌండరా?" అతడు తిరిగి చూశాడు. నవ్వాడు. 'అదేమిటే ఈ మనిషిలా నవ్వుతాడేం...'

"అవును. నేను కంపౌండర్నే!"

"మరి ఇన్నిరోజులూ మీరు లేరే?"

"నేనివేళే వచ్చాను" అతను సీసాకు లేబిల్ అతికిస్తున్నాడు. ఇంతలోకే గుమ్మంలో కారాగింది. బూట్లశబ్దం సమీపించింది. హఠాత్తుగా అమ్మాయి కాస్త దూరంగా జరిగి గోడమీదున్న కేలెండర్లను చూడసాగింది.

"హల్లో! ఏమమ్మా సరస్వతీ! మీ అమ్మ ఎలా వుంది?" అంటూ కోటుతీశారు డాక్టరు మల్లికార్జునరావు.

"బాగానే వుందండి! కాస్త దగ్గగా వుంటే మందుకని వచ్చాను. మీరు లేకపోయేసరికి—"

"ఆ! నేను లేకపోతే ఏం...మా తమ్ముడున్నాడుగా—"

"ఎవరండీ?"

"ఇదిగో వీడే—శ్రీనివాస్ రావ్! మొదట ఇక్కడో రెండేళ్ళు చదివి తర్వాత విశాఖపట్నంలో ఎం. బి. బి. ఎస్. పూర్తిచేశాడు. వచ్చి వారమయింది..."

'కంపౌండరు' చిరునవ్వుతో సరస్వతివైపు చూశాడు. సరస్వతి కళ్ళలోని కోపానికి తాత్పర్యం డాక్టర్ మల్లికార్జునరావు కందలేదు. మందుసీసా పుచ్చుకుని చరచర నడిచిపోయింది సరస్వతి...

కళ్ళు తెరిచాడు శ్రీనివాసరావు. గదంతా చీకటిగా వున్నట్లనిపించింది. ఆకాశాన్ని చూశాడు. చందమామను తన పమిటచాటున దాచుకుందొక మబ్బుకన్నె.—

*   *   *   *

—"అబ్బ..ఇవాళ్టికిహ చాల్లేవే అక్కయ్యా!" అని ఆవలిస్తూ తన చాపమీద పడుకుంది సరస్వతి.

"అదేమే, రోజూ పడుకొందుదాక నా ప్రాణం తీసేదానివిగా..." అంది లక్ష్మి.

"ఇవాళ కాస్త తలనొప్పిగా వుందక్కయ్యా..."

"అయితే ఆమాట నాతో ఇంతవరకూ చెప్పలేదేం?" అని లేచివచ్చి లక్ష్మి చెల్లెలి నుదుటిమీద చేతి నానించింది. "కాలిపోతూందే సరస్వతీ!"

"ఏమీ లేదే!...నిద్రపడితే అదేపోతుంది..."

"నీ వృత్తి తెలివితక్కువదానివే...పైపెచ్చు అందరికీ మాత్రం ఆరోగ్య సూత్రాలు వల్లిస్తావు... తలనొప్పిగా వుంటే ఇవాళ ఈ వెనక పాఠాలసలు ఎవరు చెప్పమన్నారూ...?" అంటూ లక్ష్మి తన చెల్లెలి తలను తన ఒడిలో వుంచుకుని నెమ్మదిగా ఒత్తసాగింది.

"ఫరవాలేదక్కయ్యా! నీ వెళ్ళి పడుకో!"

"నీవు నోరుమూసుకుని నిద్రపో ముందు..." అని మందలించింది ఇరవైరెండేళ్ళ కన్య లక్ష్మి...—

*   *   *   *

"నమస్కారమండీ డాక్టరు గారూ!"

"నమస్కారమమ్మా! ఏమిటిలా వచ్చావు...? అమ్మ దగ్గెట్లా వుంది?"

"ఫరవా లేదండీ—"

"వీరు మీ తమ్ముడు కాదూ?"

"అవునండీ...వీడికి రెండురోజులనుండి మెడ ప్రక్క వాపుగా వుందండీ..."

"ఓహో...ఏదీ ఇలా రాబోయ్.." ఇంతలో టెలిఫోన్ మోగింది. డాక్టరు లేచి వెళ్ళారు.

సరస్వతి కళ్ళు వెతుకుతున్నాయి.

మల్లికార్జునరావు వచ్చారు. "అమ్మాయ్! నీవిలా కూచో—! నేనొక 'డెలివరీ' కేసు కోసం వెళ్ళాలి! మా బ్రదర్ వస్తాడూ—" అని లెదర్ బేగ్ తీసుకుని, నౌకర్ని పిలిచి మేడమీదకు కబురు పెట్టారు.

శ్రీనివాసరావు మెట్లు దిగుతున్నాడు.

వీధిలో కారు బయలుదేరింది.

సరస్వతి హృదయం గడియారంలా వినవస్తూంది. 'ఆఫీసులో డైరెక్టరుగారు మొదలు ఎంతమంది మగ

వాళ్ళతో మెలగవలసి వస్తుందీ...కానీ ఇక్కడ ఎందు కిలా...'

దగ్గర కొచ్చి నిల్చొని గొంతు సరిచేసుకున్నాడు డాక్టరు శ్రీనివాసరావు.

"న...న...నమస్తే."

"నమస్తే... మీ రలా కూర్చోండి.. ఫరవా లేదు! ..అమ్మగారి దగ్గు తగ్గిందా?"

"ఆ."

"మళ్ళీ అమ్మగారి మందుకోసం వచ్చారా?"

"కాదు!"

"మరి?"

"మా తమ్ముడికి —" అని బాబ్జీ మెడమీద వాపును చూపెట్టింది సరస్వతి.

శ్రీనివాసరావ్ పరీక్షించి చూశాడు.

"ఇది, లోపల 'గ్లాండ్సు'కు సంబంధించిన వాపు..." సరస్వతి భీత హరిణేక్షణ అయింది..." అబ్బే...అపాయం ఏమీ లేదు లెండి మీరు త్వరగా వచ్చారుగనుక చాల తేలికగా నయమయి పోతుంది.... ఇపుడో ఇంజక్షనిస్తాను. రేపి పాటికి వాపు తీసే స్తుంది..." అని శ్రీనివాసరావ్ కాసేపు డాక్టరయాడు.

స్టవ్ వెలిగించి సిరంజి స్టెరిలైజ్ చేశాడు. ఇంజక్షన్ ట్యూబు పగలగొట్టి, సూదిని ట్యూబులోకి దింపి, మందును సిరంజిలోకి లాగుతున్నాడు శ్రీనివాసరావు. సరస్వతి కళ్ళార్పకుండా చూస్తూంది.

'ఆ వేళ్ళు... ఆ వేగం... ఆ.. నిపుణత... ఆ మొహంలోని దీక్ష!'

మందుట్యూబ్ పారేసి శ్రీనివాసరావు ఇటు తిరిగాడు......"అక్కయ్యా! పోదామే..." అన్న బాబ్జీ గొంతు వాళ్లిద్దరి చూపులకూ విడాకు లిప్పించింది.

సరస్వతి మొహం కుంకుమభరిణ అయింది.

శ్రీనివాసరావ్ చిరునవ్వు నవ్వాడు. "కాస్త వీడి మొహం అటు తిప్పి పట్టుకుంటారా?"

అలాగే చేసింది సరస్వతి వంగి ఇంజక్షనివ్వ బోయాడు శ్రీనివాసరావు. బాబ్జీ 'కెవ్'మని ఒక్క ఊపుఊపాడు. వాడిని పట్టుకున్న సరస్వతి చేయి తటాలున ఎగిరి శ్రీనివాసరావు చెంపక్రింద తగిలింది.

"క్షమించండి!"

"ఫరవాలేదు." ఇటు తిరగలేదు శ్రీనివాసరావు— "అబ్బాయి...ఇదిగో...ఒక్క నిముషం—నీవు చాల ధైర్యవంతుడివికదూ...ఏదీ ..అటు తిరుగూ...ఊ... అయిపోయిందీ..."

సిరంజిని 'ట్రే'లో పడేసి చేతులు కడుక్కున్నాడు శ్రీనివాసరావు; తువ్వాలుతో తుడుచుకుంటున్నాడు.

"ఎంత ఇవ్వాలండీ?" అని అడిగింది సరస్వతి.

"ఏవిటండీ?"

"ఇంజక్షనుకు—?"

"ఓ అదా...ఫరవా లేదులెండి!"

"అంటే...?" సరస్వతి మొహంలో దెబ్బ తిన్నట్లు లేచిన పౌరుషం శ్రీనివాసరావులో ఆమె మీద గౌరవానికి నాంది అయింది.

"తర్వాత ఇద్దురులెండి..."

"అలా కాదు. దయచేసి చెప్పండి..."

"ఆ ఇంజక్షన్ ఖరీదు మూడు రూపాయలు."

సరస్వతి టేబిలుమీద నాలుగు రూపాయ లుంచింది.

"ఒక్క రూపాయి ఎక్కువగా వున్నట్లుంది!"

"మీ ఇంజక్షన్ ఛార్జీతో కలిపి వుంచాను."

"భలేవారండీ మీరు!" అన్నాడు శ్రీనివాసరావ్ నవ్వుతూ. సరస్వతి మనసు ఆమె వద్దంటున్న కొలది పౌర్ణమినాటి అర్ణవమయింది. కాళ్ళు చెప్పినమాట వినడం లేదు.

"పోదామే అక్కాయ్" అన్నాడు బాబ్జీ.

"వస్తానండీ!"

"వీలుంటే మళ్ళీ కనపడి తమ్ముడి కెలా వుందో చెబుతారా?"

"అలాగే"నని ఒప్పుకున్న సరస్వతికి "నన్ను వాడుకోవచ్చుగా" అన్న టెలిఫోను కనిపించింది...

—ఆరోజు సాయంకాలం సరస్వతి ఆఫీసు వదిలేసరికే మబ్బులు దట్టంగా వున్నాయి. ఆమె బస్సెక్కింది.

'బాబ్జీవాపు ఆయన చెప్పినట్లు ఒక్క రోజులో తగ్గిపోయింది...ఆయన ఎంత సరిగ్గా చెప్పారో!... మళ్ళీ కనపడి చెప్పమన్నారు తనతో...మూడురోజు లయినా వెళ్ళలేదు...వెళ్ళాలి...అబ్బే...ఎలావెళ్లడం ...ఆయన కళ్ళలా...'

కండక్టరు అరిచాడు. తనస్టాపువచ్చింది; సరస్వతి దిగబోయింది.

వర్షం ధారాపాతంగా కురుస్తూంది. పేవ్ మెంటంతా నీళ్లు.

"దిగవమ్మా!" అన్నాడు కండక్టరు. సరస్వతి దిగింది.

కళ్ళు తెరవడంకూడా కష్టమనిపించేంత వర్షం.

అలాగే తలెత్తిచూసింది సరస్వతి. ఎదుటవున్న షాపుల పంచలో కాసేపు నిలబడదామనుకుంది. కాని వర్షంపడని ప్రతీ చదరపు అంగుళానికీ ఒక్కరు చొప్పున ఇరుక్కుని వున్నది మహానగరం జనాభా.

ఏమీ తోచలేదు సరస్వతికి. ఆ పాటికే నెత్తి మీదనుండి మొహంమీదకు నీటిధారలు కారడం మొదలెట్టాయి.

క్షేమంగా తడవకుండా నిల్చున్న పురుషపుంగవులందరికీ ఆ యువతి అలా తడుస్తుంటే చూడ వినోదంగా వుంది!

"ఏమండోయ్!" సరస్వతి తిరిగింది.

బస్ స్టాప్ ప్రక్కనే కారాగింది. తలుపుతీస్తూ....

"ముందు లోపలికిరండి!" అన్నాడు శ్రీనివాసరావు.

సరస్వతి ఏమి మాటాడలేకపోయింది.

శ్రీనివాసరావు కాస్త తలుపుప్రక్కగా జరిగి "రండీ! వస్తారా లేక..." అంటుంటే సరస్వతి మాట్లాడకుండా వెళ్ళిపోబోయింది.

శ్రీనివాసరావ్ గబగబ కారుదిగి, సరస్వతి జబ్బ పట్టుకుని, తీసుకెళ్ళి కూచోపెట్టి, తలుపుమూసి, కారు 'స్టార్ట్' చేశాడు.

పేవ్ మెంటుమీద కొందరు నాగరికుల కనుబొమలెగిరాయి.

"పట్టపగలు! నడిబజారులో!!" అని ముక్కుమీద రెండువేళ్ళు వేసుకుంది ఒక శ్రీహరి.

"ఎంత తెలివితక్కువ వారండీ మీరూ! అంత వర్షంలోనూ అలా తడిసిపోతూ నిల్చుంటారేం...ఏదీ, మైగుడ్ నెస్! మీ తల...ఓ చిన్న చెరువులా తయారయిందంటే నమ్మండి!...ఇదిగో...మీ సీటు వెనకాల తువ్వాలుంది. దయచేసి తుడుచుకోండి...ఊ...నామాట వినండీ...ఇంత చదువుకున్నవాళ్ళు మీరు ఇలా చేస్తారేమిటండీ...ఫూలిష్! వెరి ఫూలిష్! అనవసరంగా జబ్బును తెచ్చుకోవడం...హుం"

తల ఒత్తుకుంది సరస్వతి ఎక్కడో తేలి తేలి పోతున్నట్లుంది. కారెక్కడికి పోతూందో తెలియడం లేదు. శ్రీనివాసరావ్ స్వరం మాత్రం వెచ్చగా, కమ్మగా, మత్తుగా, మెల్లగా, వినవస్తూంది.

"ఏమండీ...మిమ్మల్నే! మాటాడరేం? కోపం వచ్చిందా నా మీద?" ప్రాధేయంతో అడిగాడు శ్రీనివాసరావు.

"ఎందుకూ?" అంది సరస్వతి నెమ్మదిగా ఒక్కొక్క మాటనూ పంజరంనుండి వదిలి పెడుతున్నట్లు.

"అమ్మయ్య! ఆఖరికి మౌనం ముగిసిందన్నమాట!"

సరస్వతి నవ్వింది.

"ఇంత చక్కగా నవ్వగలిగినవాళ్ళు అలా మొహం ముడుచుకూచుంటే కోపం వచ్చిందనుకోక మరేంటీ?"

"నాకు కోపం ఎందుకండీ? ఇంకా మీకు నేను 'థాంక్స్' చెప్పాలిగానీ—"

"అలా చేయి పట్టుకుని తీసుకు వచ్చినందుకు బాధపడ్డారేమో, 'అపాలజీ' ఇచ్చుకుందామని..."

"అబ్బే...అదేమీ..." అనబోయి తన కుడి జబ్బను చూచుకుంది సరస్వతి. శ్రీనివాసరావ్ వైపు చూసింది. అతడి దృష్టి రోడ్డుమీదవుంది. ఎడమచేయి ఒడిలో వుంది; కుడిచేయి 'స్టీరింగ్'మీద వుంది. 'ఆ...వేళ్ళు...ఎంత సున్నితంగా వున్నాయి! ఇందాక ఆ వేళ్ళే తన...'

కారు నెమ్మదిగా ఆగింది. రోడ్డుమీద జన సంచారం అట్టేలేదు. మంత్రముగ్ధలా కూచుని వుంది సరస్వతి.

"ఒక్క నిముషం వుండండీ!" అని కారు దిగాడు శ్రీనివాసరావు. కారు వెనకతలుపు తెరిచి, మళ్ళీ వెంటనే మూశాడు; 'పేవ్ మెంటు' దాటాడు.

పాల వెన్నెలల పూలబాటల మీదిదే జీవిత పథమనీ, దాని చివరిని నందనవనం తనకోసం తప్పకుండా కాచుకుని కూచుంటుందనీ, ప్రతీ వ్యక్తి కలల వలలు విసరవలసిన వయసులో—సంసార భారాన్ని తన భుజాలమీద భరిస్తున్న సరస్వతి,—ఆ కొద్ది సేపూ, తన్నూ తన జీవితాన్ని మరిచి తాత్కాలికమయిన ఆ వర్తమానాన్నే నిరంతర భవితవ్యంగా చేసుకోవాలనీ, అప్పటి ఆ క్షణికానుభూతిని తనివి తీరా అనుభవించి, దానికి చిరంజీవిత్వంపోసి దాచుకోవాలనీ, ప్రయత్నిస్తూంది అవ్యక్తంగా.

శ్రీనివాసరావు వచ్చాడు. ఫ్లాస్కులోని వేడి వేడి ఓవల్టీను కప్పులోకి పోసి..."పుచ్చుకోండి"

అన్నాడు సరస్వతి చేతికి కప్పందిస్తూ. సరస్వతి అతడి కళ్లల్లోకి చూసింది.

"ఊఁ...తాగండి ముందు...లేకపోతే చల్లారి పోతుంది."

"ఇప్పుడు నాకెందుకండీ?"

"తప్పతడిసి పోయారు మీరు...కాస్తవేడిగా ఇది పుచ్చుకుంటే సర్దుకుంటుంది...ఊఁ! తీసుకోండీ! నామాట వినరూ?"

సరస్వతి ఆ కప్పును తీసుకోకుండా వుండలేక పోయింది.

"మరి మీరో?"

"నేను కూడాను! అంత నిస్వార్థపరుణ్ణి కావం డోయ్! నేను చాల చెడ్డవాడిని!"

గలగల నవ్వుతూ ఓవల్టీను కప్పును పెదవుల కానించింది సరస్వతి. తడిసిన జుత్తురేగ, చుట్టూ చేరి అల్లరి పెడుతున్న సరస్వతి మొహాన్ని ఒవల్టీన్ పొగల మీద చూసిన శ్రీనివాసరావు అంతరంగంలో ఒక పెద్ద ప్రశ్నకు జవాబు దొరికినట్టయింది

కారు కదిలింది. ఇద్దరూ మాటాడలేదు. పది నిముషాల్లో తిలక్ హైస్కూలు దగ్గరాగింది కారు.

సరస్వతి ఉలిక్కి పడింది. 'అవును తను ఇంటి దగ్గరకు వచ్చారు. అబ్బ! ఇవాళ ఇల్లింత త్వరగా వచ్చేసిందే...'

"మీ ఇంటికి ఎటుతిరగాలో చెబుతారా?"

"అబ్బే వద్దులెండి! నేను దిగివెడతాను."

"ఏం...?"

"ఏమీ లేదు." అని కారు తలుపు తీయబోయింది సరస్వతి. కాని తలుపు ఒప్పుకోలేదు.

"చూశారా మరి...కరుకు కూడా మీరు వెళ్ళడం అంటే ఇష్టంలేదు."

"తలుపు తీయండి!" ఆస్వరంలో సరస్వతి "సముద్రంలో దూకండిఅన్నా శ్రీనివాసరావు ఆలోచించే వాడు కాడు.

శ్రీనివాసరావు దిగివచ్చి బయటనుండి తలుపు తీశాడు. సరస్వతి దిగింది. అతడు కారుతలుపువానుకుని నిల్చున్నాడు.

"వస్తాను. థాంక్స్?"

"ఫరవాలేదు కాని...మళ్ళీ మిమ్మల్ని చూడ్డం ఎప్పుడో?" సరస్వతి పక్కకు తిరిగి చూసింది.

"ఎలకరేం? మనం కలుసుకోవడం మీ కిష్టంలేదా?"

"అదికాదు."

"మరేమిటి చెప్పండి!

"మీరు నా మీద బహువచనం ప్రయోగించడం మానుకోవాలి."

"ఒస్ అదా!"

"వస్తానండి" అని వెళ్లిపోయింది సరస్వతి. ఆమె భుజాన్ని ముట్టుకోబోయాడు శ్రీనివాసరావు తటాలున వెనక్కు తిరిగిందామె

"మళ్ళీ ఎపుడు కనబడతారో చెప్పకుండా నే వెళ్లి పోతున్నారు?"

"మళ్ళీ వర్షం వచ్చినపుడు!" అని నవ్వి లేడిలా నడిచిపోయింది సరస్వతి. ఆమె వీధిమలుపు తిరిగిన తర్వాత కూడా ఆ వైపే చూస్తూ నిలున్నాడు శ్రీనివాసరావు.

* * * *

ఎస్. ఎస్. ఎల్. సి పరీక్షలు మొదలయాయి.

ఆఫీసుకు సెలవు పెట్టి మొదటి రోజున లక్ష్మిని పరీక్ష హాలుకు తీసుకెళ్లి కూచోబెట్టింది సరస్వతి, సాయంకాలంవెళ్ళి పిలుచుకొచ్చింది. ఆ పదిరోజులూ అక్కా చెల్లెలూ పుస్తకాలతో కుస్తీ పట్టారు.

పరీక్షలన్నీ అయిపోయాయి.

"అమ్మయ్య" అని నిట్టూర్చింది—సరస్వతి!

—వారంరోజుల తర్వాత ఒక రోజు పొద్దున సరస్వతి మామూలు కన్న కాస్త త్వరగా లేచింది. ఆ పాటికే లక్ష్మి వంటింట్లో కుంపటి రాజవేస్తోంది. సరస్వతి తిన్నగా దొడ్డి వైపు వెళ్ళింది. అక్కడ కమలమ్మ నీళ్లి చెంబూ, చీపురూ పట్టుకుని కడగడం చూసింది.

"ఏమిటమ్మా, పొద్దున్నే కడుగుతున్నావ్?" అంది సరస్వతి ఆవలిస్తూ.

"అబ్బే...ఏమీ లేదే..." అన్న కమలమ్మ వాలకం సరస్వతికి సందేహం కలిగించింది. సరస్వతి కళ్లు తుడుచుకుని, తొంగి, కాలవ వైపు చూసింది. ఎర్రటి మరకలు నీటిమీద తేలుతూ వెళ్తున్నాయి.

"అమ్మా!" అని అరిచింది సరస్వతి. చెంబూ చీపురూ వదిలేసి సర్వతిని చేతిచుట్టులోకి తీసుకుంది కమలమ్మ.

"ఎన్ని రోజులనుండీ ఇలా దాస్తున్నావమ్మా?"

"ఏమీ లేదు సరస్వతీ! రెండు రోజులలా వుంటుంది- అదే పోతుంది. డాక్టర్ గారి మందు పుచ్చుకుంటున్నానుగా..." సరస్వతి వణికిపోతూంది.

"ఆఖరికి మాకు నువ్వు కూడా లేకుండా చేయ దలచుకున్నావామ్మా?"

"పిచ్చితల్లీ! నేనున్నా పోయినా ఒక్కటే! సుఖభోగలతో వుండవలసిన దానివి నీవు మగవాడిలా సంపాదిస్తూ, వాళ్లని చదివిస్తూ, నన్ను పోషిస్తూవుంటే ఇలా ఎంతకాలం చూస్తూండను సరస్వతీ?"

"ఇంకెప్పుడూ అలాగా మాట్లాడకమ్మా..." అని ఆమెను పడకగదిలోకి తీసుకెళ్ళి పక్కలో బెట్టి, అక్కడనుండి కదలవద్దని చెప్పి వంటింట్లోకి పరుగెత్తుకు వెళ్ళింది సరస్వతి. లక్ష్మితో చెప్పింది. లక్ష్మి కంటనీరు పెట్టింది.

"అదేవిటక్కయ్యా! నీవు పెద్దదానివి—మాకు ధైర్యం చెప్పాలి! ముందు కళ్లుతుడుచుకో...ఇది వింటే ఇపుడు పిల్లలు లేస్తారు. నీవు కాఫీ పెడుతూండు. నేనువెళ్ళి డాక్టరుగారికి ఫోన్ చేసి వస్తాను!...ఎంత డబ్బయినా సరే అమ్మకు మందు ఇప్పిద్దాం—" అని సరస్వతి ప్రక్కన ఇంజనీరు గారింటోనుండి ఫోన్ చేసింది.

ఫోన్మీద డాక్టర్ మల్లిఖార్జునరావ్ పలికేసరికి సరస్వతికి కొంత నిరాశకలిగింది. ఆ పరిస్థితిలో తన స్వార్థం గురించి ఆలోచిస్తున్నందుకు తిన్నుతాను దూషించుకుంది సరస్వతి. డాక్టరుగారితో అమ్మ విషయం చెబితే ఆయన ఇంకోగంటలో వస్తానన్నారు.

వచ్చారు; చూశారు.

సరస్వతిని గుమ్మందగ్గరకు తీసుకవెళ్ళి చెప్పారు మల్లిఖార్జునరావు—"అమ్మాయ్! మీ అమ్మగారికి క్షయ ఇపుడే ఆరంభమయింది. కానీ ఏమాత్రం భయపడాల్సిన అవసరంలేదు. చాల మంచిమంచి మందులున్నాయి. ఆవిడకు చక్కగా గాలీ, విశ్రాంతి, పుష్టికరమయిన ఆహారమూ వుండాలి. అంతేనమ్మా. సాధ్యమయినంత త్వరలో ఆవిడకేమీ లేకుండా చేద్దాం...ఇదిగో ఈ ఇంజక్షను తెప్పిస్తే, సాయంకాలం వచ్చి వేసి వెడతాను..." అని ప్రిస్క్రిప్షన్నిచ్చారు మల్లిఖార్జునరావు

ఫీజు ఇవ్వబోయింది సరస్వతి.

"వ్రెరితగ్గ్! నీవు మొదట ఆ ఇంజక్షను మందు తెప్పించవమ్మా" అని వెళ్లిపోయారు. డాక్టరుగారు.

ఆ ప్రిస్క్రిప్షన్ని తనదగ్గరవున్న ఐదు రూపాయలనూ ఇచ్చి గాయత్రిని మందులషాపుకు పంపింది సరస్వతి. ఒక్క ఇంజక్షనుట్యూబు ఖరీదు పన్నెండు రూపాయలంటూ వెనక్కి వచ్చింది గాయత్రి.

ఉన్నట్లుండి లక్ష్మి పలికింది. "ఒక్కనిముషంలో వస్తాను. సరస్వతీ! కాస్త కుంపటిచూడు..." అని బయటికి వెళ్ళింది.

పదిహేను నిముషాల తర్వాత వచ్చింది లక్ష్మి. "ఇదుగో సరస్వతీ! ఇరవయి రూపాయలు! ఆ అయిదూ కలిపితే అమ్మకు రెండుట్యూబుల మందొస్తుంది" అంది లక్ష్మి.

"ఎక్కడిదక్కయ్యా ఈ డబ్బు?" అని ఆ ఇరవై రూపాయల నందుకున్న సరస్వతి దృష్టి లక్ష్మి చేతులమీదికి వెళ్ళింది. వాటిమీద ఉండవలసిన రెండు బంగారుగాజుల స్థానే ఆరేసి రబ్బరుగాజులున్నాయి.

"ఏంపని చేశావక్కయ్యా?"

"ఆ గాజులకేం సరస్వతీ... భగవంతుడి కృపవల్ల నేనా పరీక్ష పాసయి ఉద్యోగం సంపాదించుకుంటే—వడ్డీతోసహా కట్టి పారేసి తెచ్చుకో వచ్చు. మనకు ఈ గాజులకన్న అమ్మ ఆరోగ్యం ముఖ్యం కదా!"

"అయినా నన్నోమాట అడిగివుండకూడదా అక్కయ్యా? నా చేతులమీద నాలుగున్నాయి కదా?"

"ఛీఛీ ముద్దుమొహమా! నల్గురిలో మెలగవలసిన దానివి, ఆఫీసు కెళ్ళేదానివి, నీవు బోసిచేతులతో పోవడమా! నోరుమూసుకో ఇహ!" అని లక్ష్మి గాయత్రిని పిల్చింది.

గాయత్రి వెళ్ళి రెండు మందుట్యూబులూ, చిల్లరా పట్టుకొచ్చింది.

"అక్కయ్యా! మా బళ్లో నే... మేష్టారూ... ఇవాళ శుక్రవారం పూజకూ... అణా పట్టుకురమ్మన్నారే." అని తయారయ్యాడు బాబ్జి.

"అంతా ఉత్తిదే, అక్కయ్యా!" అంది గాయత్రి.

"తంతాను..." అన్నాడు బాబ్జీ.

"వెధవా! ఈసారి ఆ మాటంటే జాగ్రత్త. ఇంద, ఈ అణా పుచ్చుకో" అంది సరస్వతి.

గడియారం ఎనిమిదిన్నర కొట్టింది. సరస్వతి ఆఫీసుకు బయలుదేరడానికి సన్నాహం మొదలెట్టింది.

గాయత్రి వచ్చింది "అక్కయ్యా!" అంది ఏదో తప్పుచేసిన దానిలా.

"ఏవిటే?"

"మరి రేపు మధ్యాహ్నమేమో..."

"ఊ! చెప్పు..."

"మా థర్డ్ ఫారం వాళ్ళందరికీ టీపార్టీవుందే... దానికో రూపాయి ఇవ్వాలిట."

"ఊ—" అని గాయత్రిని దగ్గరకు తీసుకుంది సరస్వతి. దాని జుత్తుని వేళ్ళతో దువ్వుతూ ఒక్క నిముషం కళ్ళు మూసుకుంది సరస్వతి. గాయత్రి తలెత్తి అక్కయ్యను చూసింది.

"పోనీలే అక్కయ్యా! డబ్బు లేకపోతే నేను ఆ పార్టీకి వెళ్ళనులే"

"ఛీఛీ పిచ్చిదానా! అందుక్కాదే... నీవు ఆ పార్టీకి ఏ బట్టలు వేసుకువెళ్ళితే బాగుంటుందో అని ఆలోచిస్తున్నాను."

"నా నీలిపూల పావడానూ, గులాబిరంగు గౌనూ తొడుక్కుంటా నక్కయ్యా!"

"అలాగే! నీకా రూపాయి సాయంకాలం ఇస్తాను... ఏం?"

గాయత్రి చెంగున ఎగురుకుంటూ వెళ్ళిపోయింది. అవైపే చూసి నిట్టూర్చింది సరస్వతి. బలవంతాన అక్కడనుండి కదిలింది...

ఓ నెలరోజుల పిదప, సరస్వతి చేతులమీది బంగారుగాజులు నాలుగూ వెళ్ళిన తర్వాత కమలమ్మ దగ్గు కాస్త తగ్గుముఖం పట్టింది. అయినా డాక్టరు మాత్రం ప్రతీ శుక్రవారమూ వచ్చి ఇంజక్షను ఇచ్చి వెళుతున్నారు. కమలమ్మకు బొత్తిగా రాత్రిళ్ళు నిద్ర రాకపోతే మల్లిఖార్జునరావ్ అత్యవసరమైతే తప్ప వాడవద్దని నిద్రమాత్రలు రాసిచ్చారు. ఆ మాత్రలకు జాగ్రత్తగా దాచమని అక్కయ్యతో మరీ మరీ చెప్పింది సరస్వతి.

ఈ మధ్యలో సరస్వతి డాక్టరింటికి వెళ్ళలేకపోయింది. ఒకరోజు సాయంకాలం ఆఫీసునుండి వస్తుంటే బస్సు, పార్కు రోడ్ మీద రద్దీ ఎక్కువగ వుండడంవల్ల, కొద్ది నిముషాలు ఆగింది. కిటికీ ప్రక్కన కూర్చున్న సరస్వతి బయటికి తొంగిచూసింది. తమబస్సు ప్రక్కనే టాపు తీసేసిన కారులో కూచున్న శ్రీనివాసరావు కనుపించాడు. పలకరిదామనుకుంది... ఇంతలోకే బస్సు కదిలింది. వెనక్కు చూచింది. కానికారు కనబడలేదు ఆ సందడిలో.

ఆ రోజు సరస్వతి ఆఫీసుకు వెళ్ళిపోయిం తర్వాత పోస్ట్ బంట్రోతు కమలమ్మ పేరిటకి ఓ కవరిచ్చి వెళ్ళాడు. దాని నందుకున్న లక్ష్మి ఆ కవరుమీద గుంటూరు ముద్ర చూసింది. తీసుకెళ్ళి అమ్మచేతికిచ్చి వరండాలోకి వచ్చి ఏదో అలుతూ కూచుంది. అలవాటు ప్రకారం ఆ వుత్తరం ఏమిటో .కమలమ్మ పిలిచి చెప్ప లేదు. కమలమ్మ దొడ్డివైపు వెళ్ళినపుడు లక్ష్మి పడకగది లోకి వెళ్ళి ఆమె తలదిండు క్రింది ఉత్తరం తీసి చదివింది—

"...సరస్వతి మాకు అన్నివిధాలా నచ్చింది. జాతకం కూడా సరిపోయింది. ఎక్కువ ఆడంబరాలు లేకుండా పెళ్ళి జరపాలన్నది మా అభిష్టము. వేయినూట పదహార్లిచ్చి ఒక్కపూట పెళ్ళి జరిపిస్తే చాలు. అయితే, మొదట మీ పెద్దమ్మాయికి పెళ్ళి కానిదే మేము మీ రెండో అమ్మాయిని స్వీకరించడానికి వీలులేదు..."

ఆ ఉత్తరం అక్కడే వుంచి వరండాలోకి వచ్చిన లక్ష్మి కళ్ళు తిరిగాయి. మనసొక క్షణం పావిరసమయింది. గాయత్రి వచ్చి పిలిచేదాకా లక్ష్మి అలాగే కూచుండి పోయింది.

రాత్రి భోజనాలయిం తర్వాత సరస్వతి అడిగింది: "అక్కయ్యా! ఓ మోస్తగున్నావేమిటే?"

"ఏమీ లేదు సరస్వతీ! ఇలా నీమీద ఆధారపడుతూ మళ్ళీ నీ సుఖానికే అడ్డొస్తున్నాను గదా అని ఆలోచిస్తున్నాను."

"నా సుఖానికి అడ్డొస్తున్నావా? యెవరన్నారూ?"

లక్ష్మి మధ్యాహ్నం వచ్చిన గుంటూరు వుత్తరం సంగతి చెప్పింది.

"అక్కయ్యా! ఇందుకోసం ఇలా అకారణముగా బాధపడ్డం దేనికీ?......ఒక వేళ నీ పెళ్ళి అయిపోయి వుండినా నేనిపుడీ గుంటూరు సంబంధానికి ఒప్పుకో నేదాన్ని కానేమో?

"ఏం?" అని ఆశ్చర్యంతో అడిగింది లక్ష్మి. జవాబివ్వ లేదు సరస్వతి. సరస్వతి చూపులు దూరంగా ఎక్కడికో చూస్తున్నా అందులో ఒక నిశ్చలత, నిర్ణయమూ కనిపించాయి లక్ష్మికి. అతిడెవరయినా సరే లక్ష్మికి తగినవాడే అయివుంటాడనీ, తన చెల్లెలి విచక్షణజ్ఞానం ఆధారపడందగినదేననీ అనుకుంది లక్ష్మి.

"అయితే సరస్వతీ! కనీసం నీవయినా త్వరగా పెళ్ళి చేసుకోవే?"—అంది లక్ష్మి ఆదరంతో.

"ఎంత వెర్రిదానివక్కయ్యా! ఇపుడు నా పెళ్లి కేనా తొందర?" అని పొర్లిపడుకుంది సరస్వతి. కాని చాలసేపుదాక నిద్రపోలేదని లక్ష్మికి తెలుసు.

మరుసటిరోజు శుక్రవారం. మల్లిఖార్జునరావు గారు వచ్చి కమలమ్మకు ఇంజక్షనివ్వవలసినరోజు. సరస్వతి మామూలుగా ఆఫీసుకు వెళ్లిపోయింది.

సాయంత్రం నాలుగింటకి ఇంటిముందు కారాగింది. పరుగెత్తుకెళ్ళి తలుపుతీసింది లక్ష్మి.

కళ్ళు చెదిరాయి. పడబోయి గుమ్మంపట్టకుంది లక్ష్మి. ఒక్క క్షణంలో తమాయించుకుంది.

"కమలమ్మగారుండడం ఈ ఇంట్లోనే కదండీ?" జవాబుచెప్ప ప్రయత్నించిన లక్ష్మి తలమాత్రం ఊప గల్గింది.

"మా అన్నయ్యగారి కివాళ వేరే కేసొకటి వచ్చిందీ...అంచేత నేను రావలసివచ్చిందండీ! నా పేరు శ్రీనివాసరావు"—అంటూ అతడు లెదర్ బాగ్‌తో లోపలి కడుగు పెట్టాడు.

లక్ష్మి పూర్తిగా తేరుకుంది. అతణ్ణి అమ్మ గది లోకి తీసుకు వెళ్లింది. ఇంజక్షనిచ్చింతర్వాత శ్రీనివాసరావు చేతులు కడుక్కోవాలని సూచించాడు. అతణ్ణి దొడ్డిదగ్గరతీసుకెళ్ళి అతిడిచేతికి నీళ్ళు పోసి సబ్బునిచ్చింది లక్ష్మి. అతిడి ప్రతికదలికనూ లక్ష్మి వేయి కళ్లతో భక్షించింది. అతిడు దేనినో వెతుకుతున్నట్లనిపించింది లక్ష్మికి.

"ఆ...కంపెనీలో పనిచేస్తున్నవారు మీ సిస్టరండి?" అన్నాడు శ్రీనివాసరావు చేతుల్ని రుమాలుతో తుడుచుకుంటూ.

"అవునండీ" అనగానే లక్ష్మి హృదయం తేలికయినట్లనిపించింది.

"ఆమె ఇంకా ఆఫీసునుంచిరా లేదనుకుంటాను."

"లేదండీ!" లక్ష్మి హృదయాంబరం మీద మబ్బులు బయలుదేరుతున్నాయి.

"ఆమె రోజూ ఇంటికి లేట్‌గా వస్తారేమో కదూ?"

"ఆరింటికి వస్తుంటుందండి!"

ఎడమ మణికట్టుమీద షర్ట్ తొలగించి చేతి వాచి చూసుకున్నాడు శ్రీనివాసరావు. "నాలుగున్నరే అయింది!" అన్న శ్రీనివాసరావు స్వరంలోని నిరాశ లక్ష్మి గుండెను గొడ్డలితో నరికింది. ఆమె అనుమానం అయిదు నిముషాల వ్యవధిలో యదార్థంగా ఘనీభవించింది.

నాలుగేళ్ళకింద ఒకానొక రోజు సాయంకాలం బస్ స్టాపు— చిరునవ్వు—నీలి టై—స్టెతస్కోపూ... తిరిగాయి లక్ష్మికళ్ళముందు. ముందురోజు రాత్రి గుంటూరు సంబంధం వద్దన్నప్పటి సరస్వతి నిశ్చలమయిన దూరపు చూపులు సుత్తి దెబ్బల్లా తగిలాయి. వెనువెంటనే.

"వస్తానండి!" శ్రీనివాసరావ్ బయటికి వచ్చాడు. "ఈ అమ్మాయి! అదేమిటో వింతగా...పరధ్యానంగా వుంటుందేం? పాపం, నాన్నగారు పోయారు; అమ్మ ఆరోగ్యం సరిలేదు...దిగులు కాబోలు... అయినా ఈ మెకూ సరస్వతికీ ఎంత తేడా వుందీ!"

శ్రీనివాసరావు లక్ష్యశూన్యుడై కారునడుపుకుంటూ వెడుతున్నాడు.

"ఏమీ తోచడంలేదు. ఎక్కడికెళ్ళాలి... ఉత్తి ఇడియట్‌ని! ఇవాళ పొద్దున "కమలమ్మగారికి ఇంజక్షనిచ్చి రావోయ్" అని అన్నయ్య చెప్పేసరికి టయిమయినా చూచుకోకుండా సరస్వతిని చూడవచ్చుగదా అన్న ఉత్సాహంతో వచ్చేశాను... ఆ రోజు కారులో దిగబెట్టిన తర్వాత మళ్ళీ కనపడనే లేదు...తను!...ఏదయినా సినిమాకు వెడితే...అయినా టయిము ఏడున్నరగా!..."

శ్రీనివాసరావ్ పార్క్ రోడ్ 'కెర్బ్'లో కారు ఆపి దిగాడు. సిగరెట్టు వెలిగించి నడిచాడు. థియేటరు ముందు పేవ్‌మెంటుమీద నిల్చుని 'జెనిఫర్ జోన్స్—గేర కూపర్'ల పోస్టర్ చూస్తున్నాడు.

"నమస్తే" అంత శబ్దసాగరంలోనూ మెరుపు తీగలా తాకిందా స్వరం. ఉలిక్కిపడి తిరిగి చూశాడు. సరస్వతి నిలబడివుంది. ఆవిడ చేతుల్లో ఏదో పేకెట్ వుంది.

"నమస్తే" అంది సరస్వతి మళ్ళీ.

"ఓ...న...నమస్తే..." ఇంకా తన అదృష్టాన్ని నమ్మలేక పోయాడు శ్రీనివాసరావు.

"అలా కొత్తగా చూస్తారేం నన్ను?"

"ఐయామ్ సారీ!...ముందీ జవాబు నుండి బయట పడదాం రండి" అని ఆవిడ చేతిని తీసుకోవడానికని తనచేతిని జాచాడు.

తన చేతిని జాచకుండానే "నేను వస్తున్నాగా!" అంది సరస్వతి నవ్వుతూ.

శ్రీనివాసరావు అంతజనాన్ని తప్పించుకుని పక్క వీధిలో వున్న ప్రశాంతమయిన ఒక పెద్ద హోటలు దగ్గరి కెళ్ళాడు. లోపలికి పోబోయాడు.

"ఒక్క మాట!" అంది సరస్వతి. అతడు తిరిగి చూశాడు:

"బిల్లు నేను చెల్లించడానికి ఒప్పుకుంటేనే లోపలికి వస్తాను."

"అబ్బెబ్బె, అదేమిటే......" అనబోయాడు శ్రీనివాసరావు.

"అయితే క్షమించండి!" అని గిరుక్కున వెనక్కు తిరిగింది సరస్వతి.

"అరెరె! భంపేశారు! ... ఒప్పుకుంటాను... రండి రండి..." సరస్వతి తిరిగిచూసింది, కాని కదల్లేదు.

"శరణాగతి తర్వాత కూడా సత్యాగ్రహమేనా?" గవ్వలు విసిరినట్లు నవ్వింది సరస్వతి.

"ఊ! కదలండీ!"

"అదిగో...ఆ 'అండీ' లే మానుకోమని ఇదివరకే మనవిచేసుకున్నాను."

"ఓ అదా...ఇదిగో ఈసారి మీరు...ఐమీన్. మనం కలుసుకునేసరికి దిద్దేసుకుంటాను లెండి...... ఐయామ్ సారీ...ఆ 'లెండి' లేవండి...మైగాడ్!"_ నవ్వేశాడు శ్రీనివాసరావు-సరస్వతి ప్రతిధ్వనించింది.

ఇద్దరూ లోపలికివెళ్ళి మేడమీద ఒకమూల టేబిల్ వద్ద కూచున్నారు. జనం బొత్తిగా లేరు. తెల్లటి యూనిఫారం ధరించిన సర్వర్ దేవదూతలా నిశ్శబ్దంగా వచ్చినిల్చున్నాడు. సరస్వతి స్వీట్లు చెప్పింది. శ్రీనివాసరావు ఆమెను చూడడమే చాలన్నట్లు కూచున్నాడు.

ఉన్నట్లుండి — "సరస్వతీ" అన్నాడు శ్రీనివాసరావు.

సరస్వతి అతడి కళ్ళల్లోకి చూసింది. 'తన పేరు ...అది తనపేరేనా ... అంత లాలిత్యమూ, అంత మాధుర్యమూ ... తన పేరులో వున్నాయా?'

"యదార్థం చెప్పడానికి సాహసిస్తున్నందుకు క్షమించు సరస్వతీ!"

'ఏమిటది'—అన్నట్లు చూసిన సరస్వతికి ఎదురు చూస్తున్న ముహూర్తం ఆసన్నమయిందని మరుక్షణం తెలిసింది.

"ఇలా దాపరికం ఎన్నాళ్ళు సరస్వతీ .?"

"డాక్టరుగారూ! నా ఇప్పటి జీవితం నాకు ఎంతో సుఖాన్ని, సంతృప్తినీ ఇస్తూంది. దానిని మార్చుకోవలసిన అవసరం కనిపించడం లేదనుకుంటున్నాను."

సర్వర్ స్వీట్లు తెచ్చి పెట్టి మాయమయాడు.

"భ్రమ సరస్వతీ, భ్రమ! కన్నతల్లిపట్లా, నీ తోడబుట్టిన వాళ్ళపట్లా నీ ధర్మమనుకుంటున్న దానిని............నిన్ను నీవు మోసగించుకోగల స్థాయికి పొడిగించుకుంటున్నావు..."

"అలా మాట్లాడకండి డాక్టర్!"

"నీకు బాధకల్గిస్తే క్షమించు సరస్వతీ! నీవూ నేనూ 'మన'మయినపుడు నీవాళ్ళ బాధ్యత నాదిగా...!

"డాక్టర్!" అన్న సరస్వతిస్వరం శ్రీనివాసరావును ఆపింది. సరస్వతి మౌనంగా కూచుంది. ఆ లేత హృదయంలో జరుగుతున్న సంక్షోభాన్ని అణగద్రొక్కడానికి ఆ అమ్మాయి తన మనోబలమంతా వినియోగిస్తున్నదని తెలిసిన శ్రీనివాసరావు టేబిల్ మీదవున్న ఆమె అరచేతిమీద తన అరచేతిని వుంచాడు.

"మాట్లాడు సరస్వతీ! నీవు సరేఅంటే మీ అమ్మతో మా అన్నయ్యను మాట్లాడమంటాను."

ఒక్క క్షణం వూరుకుండి పలికింది సరస్వతి.

"ఇంకెపుడూ ఈ ప్రసక్తి తీసుకురాకండి డాక్టర్! నా హృదయం మీకు తెలిసేవుండవచ్చు; వుండకపోవచ్చు. కాని దానిని గురించి నేనిపుడు మాట్లాడ దలచుకోలేదు. ఆవిషయమై నేనొక నిర్ణయానికి వచ్చినపుడు మీకు తెలియజేస్తాను! నన్ను నమ్మండి. అందాక ఆవిషయం గురించి మాట్లాడనని చెప్పండి డాక్టర్!" అంది సరస్వతి.

"అలాగే సరస్వతీ! నీకోసం ఇలాగే ఎన్నిఏళ్ళయినా కాచుకుని వుంటాను."

"ఎంత మంచివారు మీరు!" అని అతడి అరచేతిని తన రెండు చేతులమధ్య వుంచుకుని ఒక్క క్షణం సేపు కళ్ళు మూసుకుంది సరస్వతి.

మరుక్షణం సరస్వతి లేచింది. స్వీట్లు మాత్రం అలాగే వున్నాయి.

ఇల్లు చేరింది సరస్వతి. లక్ష్మిని పలకరించితే బాగానే మాట్లాడింది; కానీ ఎక్కడో ఏదో లోపించిందనిపించింది. కాని సరస్వతి ఆలోచనల దారి వేరయింది.

అక్కయ్య...ఇంకా ఆగుంటూరు సంబంధానికి తాను అడ్డొచ్చానని బాధపడుతూందేమో... వెర్రి మనిషి...నాన్న వుండివుంటే ఈపాటికి పెళ్ళయి ఎంతహాయిగా వుండేది అక్కయ్య!...హుం...పెళ్ళి ఆయన...వద్దన్నా ముందుకొచ్చి నిలబడతారు..... మనిషి కాదు ... దైవం...స్...అబ్బబ్బ ... ఊహు! అక్కయ్య పెళ్ళి....గాయత్రి చదువు......అమ్మ ఆరోగ్యం...బాబ్జీ ఒకడూ...ఇవన్నీ వున్నాయి... ఆయన...భవిష్యత్తంతా తనకు వదిలేయమంటారు... వీల్లేదు...అలా కాకూడదు...నాన్న ఒప్పుకోరు... నాన్నా! నాన్న ఈయన్ను చూస్తే ఏమనేవారో... ఎవరయినా ఏమనగలరూ...ఒక్క నూతే...'

సరస్వతి మనసూ, హృదయమూ భూతభవిష్యత్తులలో పడి వర్తమానానికి దూరమయాయి. ఆఫీసులో డైరెక్టరు రాజారావు "ఏమమ్మా సరస్వతీ! ఎన్నడూ లేనిది 'స్పెల్లింగు'లుకూడా తప్పుగా రాస్తున్నావే..." అన్నారు.

ఇదంతా లక్ష్మికి తెలియదు. లక్ష్మి తనచుట్టూ ఒక ప్రాకారం నిర్మించుకోసాగింది...

—వారం రోజుల తర్వాత—

మధ్యాహ్నం నాల్గింటికి "సరస్వతి గారూ! ఫోనొచ్చింది"—అన్నాడు ప్యూను. పరుగెత్తుకెళ్ళింది సరస్వతి

"ఎవరండీ—సరస్వతిగారా? వెంటనే ఇంటికి రండి... నేను మీ పక్కింటి ఆవిడను......వెంటనే రండి...మీ అక్కయ్య లక్ష్మి..." సరస్వతి ఫోన్ వదిలేసింది. ఆమెను పడిపోకుండా మరొక లేడీక్లర్కు పట్టుకుని కూచోపెట్టింది. డైరెక్టరు రాజారావుగారికీ విషయం తెలియగానే తన కారును తెప్పించి, సరస్వతిని వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళారు.

ఇంటిగుమ్మందగ్గర దిగేసరికే గుండెలు పగిలేటట్లు కమలమ్మ ఏడుపు వినిపించింది. గుమ్మంలో, అక్కడా, ఇరుగు పొరుగు ఆడా మొగా నిల్చుని వున్నారు. సరస్వతి ఒక్క దూకులో లోపలికి వెళ్ళింది 'అక్కయ్యా' అని అరుస్తూ.

హాల్లో...క్రింద...చాపమీద పడుకోబెట్టబడి వుంది—లక్ష్మి శరీరం. వార్తాపత్రికలు రెండు మూడు హాలుమూలల్లో ఎగురుతున్నాయి.

—డైరెక్టరుగారు చేతిరుమాలుతో కళ్ళొత్తుకుంటూ అడిగితే ప్రక్కింటాయన చెప్పసాగారు .. "ఇవాళ మధ్యాహ్నం ఎస్. ఎస్. ఎల్. సి. ఫలితాలొచ్చాయికదండీ! ఈ దౌర్భాగ్యురాలు పరీక్ష రాసిందిలెండి; ఫేయిలయిందిట! అందుకని వాళ్లమ్మకు డాక్టరు రాసిచ్చిన నిద్రమాత్రలసీసా అంతటినీ..." —ఇక డైరెక్టరుగారు వినలేకపోయారు...

—మరుసటి రోజు రాత్రి పది గంటలయింది. హాల్లో టేబిల్ మీద రెండు చేతుల మధ్య తలఆనించి కూచుంది సరస్వతి. గాయత్రీ, బాబ్జీ ఒకమూల పడుకుని నిద్రపోతున్నారు. పడకగదిలోనుండి కమలమ్మ వెక్కిళ్లు వినబడుతున్నాయి.

సరస్వతి లేచి సరిగా కూచుంది. డ్రాయరు తెరిచి కాగితమూ కలమూ తీసుకుంది.

'డాక్టరుగారికి,

వారంరోజులలో నేనొక నిర్ణయానికి రాగల్గినందుకు ఆశ్చర్యపోతారేమో?...మీరెదురు చూస్తున్న వార్త వంపజేయలేకపోతున్నందుకు నన్ను క్షమించండి...మీరు భవిష్యత్తులో ఎపుడూ కూడా నన్ను కలవడానికి గాని, నాతో మాట్లాడ్డానికి గాని, నాకు వుత్తరం రాయడానికి గాని ప్రయత్నించవద్దని ఈ దీనురాలి ప్రార్థన. మీ హృదయంలోని భావాలను ఎరిగినదానిని గనుకనే ఇంత కఠినమయిన కోర్కెను కోరుతున్నాను. మీరు తప్పకుండా ప్రసాదిస్తారన్న పూర్తి నమ్మకం వుంది...శెలవు.

—సరస్వతి"

ఉత్తరం మడిచి కవరులో పెట్టి లైటార్పింది సరస్వతి.

లేచి వెళ్ళి గాయత్రీ బాబ్జీలమీద చెరొక చేతినీ వేసి, వాళ్ళ మధ్య పడుకుంది సరస్వతి.